మధ్యాహ్నం ముద్దు

[చేసుకున్న పెళ్ళాం : చేసుకోతలచిన పెళ్ళాం.]

రచయిత :

తోలేటి గంగాధరము, ఎం. ఏ.

మానాన్న అన్నాడు తనకూ, మా అమ్మకూ నేను సరోజినీదేవిని పెళ్ళాడ్డం చాలా ఇష్టంగావుంటుందని. సరోజిన్ని పెళ్ళాడాలని ఆవరకే నాకు తలంపుకలిగివుంది. మాతల్లిదండ్రుల వుద్దేశంకూడా అదే అయినందుకు నాకు పట్టరాని సంతోషంకలిగింది.

సరోజిని మానాన్న చిన్ననాటి స్నేహితుని కూతురు. ఈమధ్యనే మాయింటికివచ్చి నెల రోజులపాటువుండి తిరిగి వెళ్ళింది. ఆమెసుగుణాలూ సత్ప్రవర్తనా చూచి మాయింట్లో అందరూ ఆమెని గాఢంగా అభిమానించడానికి ప్రారంభించారు.

నవనాగరికులయిన నేటి ఆడపిల్లల దగ్గర వుండే దుర్గుణాలేవీ ఆమెదగ్గర లేవు: ఆమె చాలావరకు పూర్వసాంప్రదాయాల్ని అభిమానించేదిగా కనిపించింది. ఆమెకు ఇంటిపనులూ, వంటపనులూ బాగా చేతఅవునని మాఅమ్మ సర్టిఫికెట్టుయిచ్చింది. బొద్దుగా అందంగా వుండేది. కాని ఆమెకు వల్లమాలినసిగ్గు. పైగా ముక్తసరిమనిషి. ఆమెలో నేను ప్రేమనురేకెత్తించగలనా అని ఒక్కొక్కప్పుడు సందేహంతోచేది. అయినా పెళ్ళిఅయితే సిగ్గరితనం; ముభావంపోయి ఆమె అందరిలాగే కలిసికట్టుగావుంటుందని సమాధానం చెప్పుకుని తోచినసందేహాల్ని పూర్వపక్షం చేసుకున్నాను.

అందుచేతనే క్రిస్టమసుపండగలికి తిరిగి ఆమె మాయింటికి వచ్చినప్పుడు అందరమూ సంప్రదించుకొని మా వివాహదినం నిశ్చయం చేసుకున్నాం.

వివాహం నిశ్చయం అయిన తర్వాత కూడా సరోజిని నాతో ముభావంగానే వుండేది. నేను ఏమాత్రం చనువు కలగచేసుకోవాలని చూసినా ఆమె బెదిరిపోయేది. సాధ్యమైనంతవరకు నన్ను తప్పించుకు తిరిగేది. పెళ్ళిఅనడంతోటే ఈ విచిత్రవర్తన అంతా పోతుంది అనే అనుకున్నానుకాని నాజీవితం నిండానిర్భాగ్యంఅయినది అవుతుందని అనుకోలేదు.

మానాన్న మదరాసులో పేరుమోసిన అడ్వొకేటు. మాక్రిస్టియన్లలో ఇంతప్రాక్టీసు, ఇంతడబ్బూ వున్న లాయరు మరోడులేడు. బియ్యేప్యాసై నేను మానాన్న ఆదేశంప్రకారం లాకాలేజీలోచేరి పట్టాపొందాను. మానాన్నతోబాటు నేనూ ప్రాక్టీసు మొదలుపెట్టాను. పెద్దతనంవల్ల ఇప్పుడు మానాన్న ఆరోగ్యం బాగావుండటంలేదు. కాబట్టి పని అంతా నామీదేపడింది.

మానాన్న చాలా డబ్బుగడించాడని ఈవరకే చెప్పివున్నాను. అతనికిగల పలుకుబడిన్నీ ఎక్కువయిందే. ఇల్లాంటి పరిస్థితుల్లో నాభావిజీవితం చాలాసుఖమయంగా వుండితీరుతుందని అనుకోడం గర్వం అనిపించుకోదు. నేను ఇప్పటికి ఇరువైయేడేళ్లు నిండిన యువకుణ్ణి.మాతాత జిల్లాజడ్జీపనిచేసి పింఛను

పుచ్చుకున్నాడు. నేనున్నూ ఆయనంతవాడిని కావాలని నామనస్సులో అభిలాష అగ్గలంగా వుండేది.

అల్లరి చిల్లరిగా తిరగడం మొదలయిన దుర్గుణాలేవీ నాదగ్గర లేవు. మాజాతివారిలాగ తాగే దురభ్యాసంకూడా నాకులేదు. మా జాతిలో సాధ్యమైవున్న రహస్యప్రణయాల జోలికి నే నింతవరకు ఒకసారికూడా పోలేదు. ఏదో ఓసుదినాన్ని ఓసుగుణాలరాశిని పెళ్లాడి ఒక ఆదర్శకుటుంబం స్థాపించాలని నాకు అభిలాష అగ్గలంగాఉండేది. నాకూ ఒకకొడుకు వుండాలనీ, నేను మానాన్నకి వృద్ధాప్యంలో ఉపయోగిస్తున్నట్లే అతను నాకు వృద్ధాప్యంలో ఉపయోగించాలనీ కాంక్షలు సాగించేవాడిని.

నాకు ఒకర్తే చెల్లెలు. ఆమెను మదరాసులోని ఇండియన్ బ్యాంకు మేనేజరైన పాల్‌కు యిచ్చి పెళ్ళిచేసివున్నాం. ఆమె అతనితో అనంతంగా కుటుంబసౌఖ్యం పొందుతూవుంది. ఆమెకు చిలకల్లాగా ఇద్దరుపిల్లలు. వాళ్ళ కుటుంబం వాళ్ళపిల్లల్నిచూసి నాకుకూడా పిల్లలమీదా కుటుంబంమీదా గలకోరిక తీవ్రమయింది.

మావంశంలో స్త్రీపురుషులందరూ గౌరవంగా బ్రతికేవారు. అద్భుత మేధావులు ఎప్పుడూ మావంశంలో పుట్టివుండకపోయినా తెలివితక్కువ దద్దమ్మలు ఎప్పుడూ పుట్టివుండలేదు. వాళ్ళు అందరూ సుఖంగా పెళ్ళిళ్ళు చేసుకుని శాంతంగా బ్రతికి మామూలుధోరణిలో కాలం వెళ్ళదోశారు. నావిషయంలో మాత్రం ఇందుకు వ్యతిరేకం జరుగుతుందని నేను ఎల్లా అనుకోగలను.

పైగా సరోజినితో నాకు కాబోయే వివాహాన్ని గూర్చి అందరూ ప్రశంసావా[illegible]తే చెపుతూవచ్చారు. మాచెల్లెలు 'అన్నయ్యా! నువ్వు చాలా అదృష్టవంతుడివిరా. రత్నంలాంటి పిల్లదొరికింది. మనకత్తులో శాగాకలుస్తుంది. నీ భావిసుఖానికి ఆమె ఎంతేనా సహకారిగావుంటుంది' అని అంది. ఆమాటలువిని మాఅమ్మ 'మనవంశానికి ప్రతిష్ట తెచ్చేపిల్ల సరోజిని' అని మాచెల్లెలు ప్రశంసకి ఉపబలంగా అంది. ఆసమయాన్ని మానాన్నకూడా 'నాయనా! ఇక నేను నిశ్చింతగావుంటాను. నీకు సుఖాన్నిఈయగల ఇల్లాలు దొరికింది.' అని అన్నాడు.

నా స్నేహితులుకూడా యిల్లాగే నన్ను చాలా ప్రశంసించేవారు. సరోజినివంటి కన్యారత్నాన్ని పెళ్లాడగలిగినందుకు నాకు అప్పట్లో చాలా ఆనందంకలిగింది. మావివాహంకూడా చాలా వైభవంగాజరిగింది. వివాహాలంకరణాలతో సరోజిని సౌందర్యం మరింత అతిశయించింది. సిగ్గుచేత ఇంతలో ఎర్రబారుతూ, మరి అంతలో తాజాస్థితికివస్తూవుండిన ఆమె అప్పటిచెక్కిళ్ళు నాలో సుఖమయభావాల్ని రేకెత్తించేవి.

కాని అంతలో ఆకాశం మేఘాచ్ఛాదితం అయింది. ఇద్దరం కారుమీద మి కారుకు వెళ్ళి యింటికివచ్చాము. భోజనంచేశాము. గది[illegible] కాలుపెట్టాను. ఎప్పటిబెదురుతోనేవుంది శ[illegible] చేసుకున్న పెళ్లానికి వుండవలసిన చనువు క[illegible] అట్టి సమయమందు స్త్రీకి ఉండవలసి[illegible] ఉత్కంఠ కాని ఆమెదగ్గర కనిపించలేదు. కొంతసేపు నేను బయటికిపోయి ఆమెను ఏకాంతంగావుండనిస్తే మంచిదేమో అనుకుని బయటికివచ్చాను. నాలుగైదుసిగరెట్లు కాల్చాను. సరోజిని సౌందర్యానికి, సుగుణాలకీ తగినవిధంగా నేను ప్రవర్తింపవలసిన విధాన్ని గూర్చే అంతసేపూ ఆలోచనసాగించాను.

ఇట్టి ఆలోచనలతో ఉత్సాహం ఉప్పొంగి పోతూవుండగా తిరిగి నేను గదిలోకివెళ్లాను. గదిఅంతా చీకటిగావుంది. పడుకునేటప్పుడు ఆమె స్విచ్‌నొక్కేసి పడుకునివుండాలి. స్విచ్ వేసి దీపంవెలిగించాను. నాభార్య మంచంమీద పడుకునివుంది. నా నాడి అద్భుతంగా స్పందిస్తూవుంది. నాగుండె ఉద్రేకంతో కొట్టుకుంటూవుంది. నెమ్మదిగా ఆమెవంటిమీద చెయ్యివేసి దగ్గరకుతీసుకోవడానికి ప్రయత్నించాను. ఆమె విసుక్కుని నాచెయ్యితోసేసి 'అబ్బ! నన్ను బాధించకండి' అంది.

భరింపరాని రక్తవేగంతో బాధపడుతూవున్నాను. ఆమెను బిగియార కౌగలించుకొని స్పర్శసుఖం అనుభవిద్దామని తహతహపడుతున్నాను. అయినా ఆమె అల్లాఅనగానే తహతహ యావత్తూ తగ్గించుకుని నేనుపోయి వేరే పడుకున్నాను. ఆమెసిగ్గు పూర్తిగా తగ్గిపోయేవరకూ ఆమెను అంటకూడదని నిశ్చయంచేసుకున్నాను.

కొన్నివారాలు ఇదేమాదిరిగా వెళ్ళిపోయాయి. మేము భార్యాభర్తలమే కాని దాంపత్యధర్మాన్ని మేము ఇంతవరకు ఒక్కసారికూడా నిర్వహించలేదు. నాస్పర్శతగిలిన మాత్రాన్ని ఆమెఏదో ఘోరప్రమాదం జరిగినంతగా గాభరాపడేది.

పగలుమాత్రం సరోజిని చాలాసంతోషంగాను, స్నేహపాత్రురాలుగాను కనిపించేది. మేము ఒంటరిగావున్నప్పుడు, ఆమెను చేతుల్లోకి తీసుకోడానికి నేను ప్రయత్నించినప్పుడు ఆమె భయకంపితురాలయ్యేది. క్రమంగా నాకు అర్థమయింది. సిగ్గరితనం అని నేనింతకాలంఅనుకున్న ఆమెగుణం కామవాంఛాశూన్యం అని. కామసంబంధమైన తలంపుకాని, పనిగాని చాలా అనుచితమైనవిగా ఆమెతలచిందని నేను పోల్చుకోగలిగాను.

వివాహసంబంధంచేత ఏదో ఒకగొప్ప కుటుంబానికి కట్టుబడి వసతివాళ్ళుగల ఇంటికి యజమానురాలు కావాలని ఆమెకోరివుండిందని నాకుతెలుసు. భర్తనైన నన్నుగూర్చి ఆమెచాలా గర్వంగావుండేదనికూడా నాకు తెలుసు. అయినా ఆమె సాధ్యమైనంతవరకు కామపురుషార్థంవిషయంలోమాత్రం భార్యధర్మానికి ఎడంగావుండేది. నేను ఆమెనుపెళ్లాడ్డంలో చాలా తప్పుచేశాననీ దుఃఖాన్ని కొనితెచ్చుకున్నాననీ అనుకోడం తప్పిందికాదు.

మరోరకంమనిషి ఆమెకు నచ్చివుండునేమో! కాని దరహంమీద మగవాళ్ళంటేనే ఆమెకుద్వేషం. ఆడాళ్ళని తమకామవాంఛలికి కేవలం యంత్రాల్లా ఉపయోగిస్తారని మగవాళ్ళని ఆమె పలుతడవలు నిరసించడం నేను విన్నాను.

ఒకనాడు మా చెల్లెలుయింటికి మేము విందుభోజనానికివెళ్లాం. ఒకచోట నిలిచివున్న మమ్మల్నిచూసి మాచెల్లెలు ఎంతో సంతోషించి మేము ఆదర్శకదంపతులమని అనుకుంది, అచటి ఇతరమిత్రులుకూడా అట్లాగే సంతోషించారు. కాని నిజస్థితి ఎవరికీ తెలియదు. నామనస్సుపొందే ఆందోళన ఎవరూ గ్రహించలేదు.

నేను సరోజినితో సుఖంగావున్నట్లే మా కుటుంబంలోనివారు అనుకునేరీతిగా ప్రవర్తించాను. మావాళ్ళు ఆవిషయం నమ్మేరు. సరోజిని ఇంటిని చక్కగాదిద్దేది. కొద్దివ్యయంతోనే కుటుంబాన్ని చక్కగా ఫోత్తుపరిచేది. నాకు ఏయేపదార్థాలు ఇష్టమో, ఎల్లావుంటే నేను ప్రియంపడతానో మొదలైన విషయాలన్నీ ఆమె జాగ్రత్తగా గమనించేది. ప్రతివిషయంలోను నాసుఖమే ఆమె

మొదటిఆలోచన అయివుండేదనికూడా అంగీకరింపకతీరదు.

మాయింటికి వచ్చిపోయే చుట్టాలుకూడా సరోజిని చాకచక్యాన్ని గమనించి అతిగా ప్రశంసించేవారు. అంతటి మంచిభార్యను పొందిన నా అదృష్టానికి నిండా ఆనందించేవారు. పెళ్ళయి ఆరునెలలుఅయింది. మా దాంపత్యాని పొగడని స్నేహితుడూ, చుట్టమూ లేడు. కాని నాకు దాంపత్యసుఖమనేది లేదు. నావిచారానికి అంతులేదు.

సరోజిని నన్ను ఎప్పుడూ ఉట్టిసమయాల్లో విసుక్కొని ఎరగదు. భోజనానికి ఆలస్యంగా వచ్చినా, భోజనశాల్లో సిగరెట్టుకాల్చినా కొద్దిగా విసుక్కునేది. నేను ఎల్లప్పుడూ ఆఫీసుగదిలో కూర్చుని ఇంటివిషయం యావత్తూ ఆమెకు వదిలేయాలని ఆమెకోరిక అయినట్లు నేను తెలుసుకోకలిగాను.

ఒకొక్కప్పుడు రాత్రిళ్లు నామోటతనానికి ఆమె లొంగిపోయేది. కాని ఆమెలో ఏమీ ఉషారీవుండేదికాదు. ఏదో ఇష్టంలేని పనిని నిర్వహిస్తూన్నట్లుగా వుండేది. క్రమంగా నాకు ఆమెఅంటే ఉత్సాహంతగ్గిపోయింది. తిరస్కృతమైపోతూవచ్చిన నాప్రేమ క్రమంగా ఇగిరిపోడానికి ప్రారంభించింది.

ఏడాది అయేసరికి ఆమెస్వభావం నాకు కొంతవరకు అంతుపట్టింది. పైకికనిపించేవి ఆమె పామేదాతనం, ముభావం. అంతర్యంలో ఆమె చాలా కఠినమైన మనస్సుగలదిన్నీ, ఉదాసీనురాలున్నూ. ప్రతీదానివల్ల ఏదో అపాయమేఉందనే కుశ్శంకలు పోయేమనిషి. సన్నబట్ట కట్టుకుని సూర్యరశ్మిలో నడిస్తే మానభంగం అవుతుందని అనుమానించే స్వభావం ఆమెది.

సంతానంపొందాలని నాకు సరదా. పెళ్ళి కాకముందు సరోజిని మాయింటికి వచ్చినప్పుడల్లా మాచెల్లెలుపిల్లల్ని ఎత్తుకుని బాగా లాలించేది. అందుచేత పిల్లలంటే ఆమెకుకూడా బాగా ఇష్టంగావుంటుందని నేను అనుకునేవాడిని. కాని నిలకడమీద నిజం తెలిసింది. మా చెల్లెలుపిల్లల్ని ఆమె లాలించడమంతా కపటనాటకమనీ, అంతర్యంలో ఆమెకు పిల్లలంటే ఇష్టంలేదనీ ఇప్పుడు తేలింది. స్త్రీపురుషసంయోగంచేత కాకుండా మరోమార్గం దేనిచేతనయినా ప్రపంచంలో సంతానోత్పాదనం జరుగుతూవుంటే బాగుండునని ఆమె పలుసారులు అనేది. పిల్లలుంటే చాకిరీచెయ్యడం కష్టమనీ, శుచీ శుభ్రం ఉండదనీ, పిల్లల్నికని తన ఆరోగ్యం పాడుచేసుకోననీ ఆమె నిష్కర్షగా చెప్పేసింది. పిల్లలుకావలని నేను కోరినా, ఆమెకు గర్భోత్పత్తిఅయినా ఆమె నన్ను జన్మంపొడుగునా విరోధిలా భావిస్తానని చెప్పేసింది.

అప్పటినుంచీ ఇల్లంటే నాకు పెద్దపులిలా వుండేది. మానవస్వభావం ఏమిటోకాని లాలించడానికి ఒకప్రాణిని కోరుతుంది. లాలించడానికి నాకు పిల్లలులేరు. ముద్దుగావుంటుందని ఒకసారి ఒక చిన్న కుక్కపిల్లని కొన్నాను. ఇంటికి తీసుకువెళ్లాను. నాభార్య మండిపడింది. 'ఈవెధవ ప్రభాసికుక్కపిల్ల మనకిఎందుకూ' అని ఈసడించింది. అప్పుడు చేసేదిలేక నేను ఆకుక్కపిల్లను మాచెల్లెలుయింటికి పంపేశాను.

దినదినం పెరుగుతూవచ్చిన ఆఫీసుపనితో నాకూ, ఊలుకుట్లు మొదలైనవాటితో ఆమెకూ కాలంగడిచిపోయేది. దినంలో మేము కలిసివుండేకాలం బహుకొద్దిగావుండేది. 'పెళ్ళయిరెండేళ్లు అయినా ఇంకా నాకడుపు ఫలించలేదు. బహుశా నాకు ఆ అదృష్టం

లేదేమో!' అని అప్పుడప్పుడు మాఅమ్మతోను, చెల్లెలుతోను సరోజిని అంటూ నిట్టూర్పులువిడిచేది.

ఈనాలిక చివరిమాటలూ, ఈ దొంగ నిట్టూర్పులు నాచెవినిపడ్డప్పుడు నాలోనేనేనవ్వుకునేవాణ్ణి.మరీ ఇటీవల ఆరునెలలుగా నేనూ, నాభార్యా ఒకప్రక్కమీద పడుకునేఎరగం? ఇంక పిల్లలు ఎల్లాపుడతారు? ఒకనాటిరాత్రి ఆమె చాలామోటుగా ప్రవర్తించింది. ఇక ఆమెతో తంటాలుపడి లాభంలేదని అప్పటినుంచీ ఆమెదగ్గరకు వెళ్ళడం బొత్తిగా మానుకున్నాను.

ఇక్కడ మానుకున్నా కొందరిపురుషులవలె మరోస్త్రీతో పరిచయం సంపాదించడం మొదలయిన వ్యవహారాల్లోకి నేను ఇంతవరకు దిగలేదు.

ఇల్లావుండగా ఒకనాడు ఓవిషయంజరిగింది. నాలో ఇగిరిపోతూవున్న ప్రేమను తిరిగి మొలకెత్తించి, ఇంకిపోతూవున్న ఉత్సాహాన్ని తిరిగి రేకెత్తించే పరిస్థితి ఒకటి కలిగింది. నాదురదృష్టజీవితంమూలాన్ని నాకు ఇటీవల రాత్రిళ్లు బాగా నిద్రపట్టడంలేదు. అందువల్ల ఒకనాటి మధ్యాహ్నం కోర్టుపని ఆట్టేలేని కారణంచేత ఆఫీసులో పడకకుర్చీలో బద్ధకంగా పడుకున్నాను. కళ్లుమూసుకుని కోడికునుకులోవున్నాను. ఇంతలో ఎవరో గది తలుపు తెరచి గదిలోప్రవేశించినట్లు అలికిడి అయింది.

నావద్ద టైపిస్టుగా పనిచేస్తూవున్న లూసీకన్య తలుపుతెరచి గదిలోప్రవేశించి ఏవో కాగితాలు వెతుక్కోవడం చూశాను. నాకు ఇంకా మాగన్నుగానేవుంది. కళ్లుమూసుకునే వున్నాను. ఇంతట్లో నాబుగమీద ఎవరో నెమ్మదిగా ముద్దుపెట్టుకు యింది. ఆపెదవులు అతిసుకుమారంగాను, అతిమృదువుగాను వున్నాయి. ఇరవైతొమ్మిదేళ్లనిండిన నాజీవితంలో అల్లాంటిముద్దు నేను అంతవరకు రుచిచూచి వుండలేదు. ఆశ్చర్యచకితుణ్ణి, ఉత్సాహతరంగితుణ్ణి అయి కళ్లు తెరిచిచూశాను. నాకళ్ళఎదుట లూసీకన్య బెదరిన లేడిచూపులతో నిలిచివుంది.

నాదృష్టి ఆమెమీద పడ్డంతోటే భయంతో ఆమె సీత్కారంచేసింది. కుడిచెయ్యి గుండెలమీద వేసుకుని నొక్కిపట్టుకుంది. అప్పుడు ఆమెకు కలిగిన కలవరపాటుతో ఆమెముఖం ఎర్రబారింది. గదిలోనుంచి వెళ్ళిపోడానికి ద్వారంవైపు తిరిగింది. ఆమెతత్తరపాటు తగ్గించాలనే ఉద్దేశంతో ఆమెను పిలిచి ఒకరికి . ఉత్తరంవ్రాయవలసివుందనీ, నేను చెప్పగా దాన్నివ్రాసి తరవాత టైపుచేయమనీ చెప్పేను.

నేనుచెపుతున్నాను. ఆమెవ్రాస్తున్నది. అంతసేపూ చురుగ్గా ఊపిరివిడుస్తూ పీలుస్తూ వుండి ఆమె నాకళ్ళకేసి చూడలేక పోయేది.

నేను అమందానందంలో వున్నాను. నావద్ద లూసీ చాలారోజులుగా పనిచేస్తూవున్నా ఆమెను నేను యింతవరకు ఎప్పుడూ కామదృష్టితో చూచివుండలేదు. కాని ఇప్పుడు ఆమెవైపు చాలామమకారంగా చూడ్డానికి ప్రారంభించాను. ఆమెలో ఇదివరకు ఎప్పుడూ లేని కొత్తలావణ్యమూ, కొత్తనాజూకూ నాకు కనిపించాయి. ఆమెలో ఏరీతి అందం కాని ఉన్నట్లు నేను ఇదివరకు గ్రహించలేదు. కాని ఇప్పటి నాకళ్ళకు ఆమెచర్మం ఎంతో మృదువుగాను, ఆమెనేత్రాలు ఎంతో అందంగాను ఉన్నట్లుతోచింది. ఆమెమీద నాకు ఏదో చెప్పరాని వ్యామోహం కలిగింది.

కాని ఆసమయంలో ఆమెపడుతూన్న

తత్తరపాటుకు నాకు చాలా జాలివేసింది. అందుచేత ఆమె నన్ను ముద్దుపెట్టుకున్నట్లు నాకు తెలియనట్లు, అప్పటికి నేను గాఢనిద్రలో వున్నట్లు ఆమెకు తెలియాలనేరీతిగా అప్పుడు నేను ప్రవర్తించాను. నిజానికి ఆముద్దు నాకు ప్రాణాలతోటీజన్మాంతరాన్నియిచ్చింది. దాన్ని గురించి ఆలోచించినకొద్దీ లూసీమీద నాకు ప్రేమాభిమానాలు పెచ్చరిల్లిపోతున్నాయి.

ఆమె అల్లరిచిల్లరిమనిషీ, మరోదుర్గుణం కలదీఅయి బరితెగించింది. అయితే ఆముద్దును నా ప్రస్తుతపరిస్థితుల్లో నేను ఆసహ్యించుకోకపోయినా మరిచిపోయివుందును. కాని లూసీ అట్లాంటిదికాదు. ఆమె ఇంతకాలమూ నావద్ద చాలాగౌరవంగాను మర్యాదగాను ప్రవర్తించేది. స్త్రీ చాపల్యాన్ని ఎప్పుడుగాని ఏమరిపాటునేనా నావద్ద ఆమె చూపిఉండలేదు. అందుచేతనే ఆమెఅంతట ఆమెవచ్చినన్ను ముద్దుపెట్టుకుంటే నాకు చాలా ఆశ్చర్యంవేసింది. ఆముద్దు నాజీవితంలోని ఏదోపెద్దలోటునుకుదిర్చే దివ్యమైన ఔషధంలా నాకు తోచింది.

సాయంకాలంఅయింది. ఆమె యింటికి పోవలసినవేళ అయింది. ఆమె లేచి వెళుతూంది. నేనుకూడ లేచి ఆమెతో వీధిగుమ్మం దాకావచ్చేను. ఇల్లాలేచి ఆమెను నేను సాగనంపడానికి ఇదేప్రథమం. వీధిగుమ్మందగ్గరకు వెళ్లాక ఆమెను కారులో ఎక్కించుకునిపోయి వాళ్ళహాస్టలువద్ద దిగవిడవాలని నాకు బుద్ధి పుట్టింది. ఆసంగతి ఆమెతో అన్నాను. అప్పుడు ఆమె నాకళ్లలోకి తేరిపారిచూచింది. నామనస్సునుచీల్చి అందలి ఆంతర్యం గ్రహించాలని ఆమె ఉద్దేశంఅయినట్లు ఆమె ఆచూపులకు నేను అర్థంచేశాను. ఇంతవరకు ఎప్పుడూ ఆమెను యింటివద్దకు తీసుకుపోయి నేను దిగవిడిచివుండలేదు. అయినా ఇప్పుడు దిగవిడుస్తానని అనడంతోటే ఆమెకాదనకుండాను, సందేహించకుండాను అంగీకరించింది.

కారుపోతూవుండగా మేము లోకంలోని అనేకవిషయాల్నిగూర్చి మాట్లాడుకున్నాం. కారు వాళ్లహాస్టలుముందు ఆగింది. ఆమె కారు దిగింది. నాగుండెలు వేగంగా కొట్టుకుంటూవున్నాయి. పట్టరానిసంతోషంలో నేను మునకలు వేస్తూవున్నాను.

రాత్రిఅయింది. ఒకఆడదాని ముద్దుకుగాను ఇంతగా పిచ్చిపడ్డందుకు నన్ను నేను నిందించుకున్నాను. నాఅంత తెలివితక్కువవాడు ఇంకెవడూవుండడని భావించాను. కాని పరుపుమీద పడుకోగానే మళ్ళీ మధ్యాహ్నం ముద్దు జ్ఞాపకంవచ్చింది. అది జ్ఞాపకంవచ్చినప్పుడల్లా నాఒళ్ళు పులకరించేది. ఇంతలో నాలో నాకే అవమానభావంకలిగేది. ఈ విషయం పూర్తిగా మరిచిపోవాలని నిశ్చయించుకున్నాను. కాని...

మరునాడుఉదయం లూసీ మామూలుగా ఆఫీసుకువచ్చింది. ఆమెపూర్తిగా మారిపోయినట్లు నాకు తోచింది. మునుపటికంటె వయస్సులో ఎంతోచిన్నదిగా కనిపించింది. మునుపటికంటె అందంలో ఎంతో అతిశయించినట్లుగా కనిపించింది. ఆమె బర్మాముడిలో బంధింపబడివున్న ప్రతివెంట్రుకా ఏదో కామజ్వాలను ప్రజ్వరిల్లచేస్తూన్నట్లుగా నాకు తోచింది. మునుపటిలాగ ఆమె ఎందుచేతనో నాయెదట నిబ్బరంగా వర్తించలేకుండావుంది. జంకు అనేభావంతో ఆమె క్రుంగుతూన్నట్లు నాకు తోచింది. నాముఖంకేసి ఆమె నిదానంగా చూడలేకపోతూంది. కాగితాలు కలాలు మొదలైనవి అందించేటప్పుడు ఆమె చెయ్యి నాకుతగిలినా నాచెయ్యి ఆమెకుతగిలినా ఆమెమొగం గులాబిపువ్వురంగుకు మారిపోయేది.

[సశేషము]